మస్త్.. మజా

SUNDAY SPECIAL

యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారు. ప్రస్తుత జీవన విధానం భౌతిక శరీరాన్ని మాత్రమే కాకుండా మానసిక శ్రేయస్సును కూడా ప్రభావితం చేసేలా ఒత్తిళ్లడి ఉంటోంది. అనేక బాధ్యతలను సమతుల్యం చేసుకోవడానికి ప్రయత్నించడంతో దాదాపు అందరూ అలసిపోతున్నారు. ఫలితంగా నిద్రలేమి, ఆందోళన, నిరాశ వంటి ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాంటి వారికి రిలాక్సేషన్ మంత్రదండంలా మారింది. ఒత్తిడి నుంచి బయట పడేందుకు చాలామంది స్పా సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. మానసిక ఆరోగ్యాన్ని రీబూట్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

– గాజువాక



యువతికి హెయిర్ స్పా

- యాంత్రిక జీవనంలో ఉరుకులు పరుగులు
- ఒత్తిడికి గురవుతున్న వైనం
- ఖాళీ దొరికితే ఉపశమనం కోసం మసాజ్ సెంటర్లకు..
- డిమాండ్ ఉండడంతో పెరుగుతున్న స్పాలు

స్పా సెంటర్లు ఎక్కడికక్కడ వెలుస్తున్నాయి. థాయ్, స్టోన్ మసాజ్, డీప్ టిష్యూతోపాటు ఇతర రక్షణ పద్ధతులతో స్పాసెంటర్లు మనుగడలోకి వస్తున్నాయి. ఒక గాజువాక ప్రాంతంలోనే 15కు పైగా స్పాసెంటర్లు నడుస్తున్నాయి. పాతగాజువాక ఏరియాతో పాటు కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఈ సెంటర్లు విస్తరించాయి. మసాజ్ చికిత్స, ఈత, ఎక్స్‌పోలియేషన్, మానిక్యూర్, పెడిక్యూర్, బాడీ ట్రీట్‌మెంట్స్, సువాసన చిక్సిత వంటి అనేక విధానాల ఆందోళన, నిరాశ నుంచి బయటపడడానికి సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు.

థాయ్ మసాజ్‌కు క్రేజ్

మసాజ్‌లలో థాయ్ మసాజ్‌కు ప్రత్యేక ఆదరణ ఉంది. ఇది మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని పరిశోధనలో వెల్లడైంది. థాయ్ మసాజ్ చేయించుకొనే వ్యక్తుల్లో చికిత్స తర్వాత మానసిక ఒత్తిడి తక్కువగా ఉంటుందని 2015లో జరిగిన ఒక అధ్యయనం నివేదించింది. మైగ్రెన్, తలనొప్పి ఉన్నవారు సాంప్రదాయ థాయ్ మసాజ్ చేయించుకొంటున్నారు.

- వెన్నునొప్పితో బాధ పడుతున్నవారు కూడా థాయ్ మసాజ్‌తో తగ్గుతుందని భావిస్తున్నారు.



బ్యూటీ సెలూన్‌లో ఎక్విప్‌మెంట్

స్పా సెంటర్లతో భద్రం

విశ్రాంతి కోసం స్పా సెంటర్లను ఆశ్రయించేవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. కొంతమంది వ్యక్తులు వ్యాపారమే ధ్యేయంగా బయట బోర్డు ఒకటి పెట్టి లోపల చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నారు. అలాంటి స్పా సెంటర్లకు వెళ్లినవారు తమ పరువుతో పాటు నగదు పోగొట్టుకుంటారు. అలాంటి సెంటర్లపై ఇటీవల పోలీసులు దాడులు జరిపి నిర్వాహకులను అరెస్టు చేస్తున్న విషయం తెలిసిందే. అందువల్ల మసాజ్‌లకు ప్రాధాన్యతనిచ్చే వారు ప్రొఫెషనల్ స్పా సెంటర్లకు వెళ్లడమే ఉత్తమమని అర్థం చేసుకోవాలి.

ఒత్తిడి నుంచి ఉపశమనం

- మసాజ్ శరీరానికి, మనస్సుకు విశ్రాంతినిస్తుంది. కండరాల నొప్పులను, శరీరంలో బిగుతులను తగ్గించడానికి దోహదపడుతుంది.
- నిద్ర నాణ్యతను మెరుగు పరుస్తుంది.
- కండరాల నొప్పులనే కాకుండా కీళ్ల నొప్పులు, తిమ్మిరిని నయం చేయడం, కీళ్ల బరువును తగ్గించడానికి కూడా స్పా దోహదం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.
- వ్యాయామం చేయలేనివారికి తమ శరీరంలో క్యాలరీలను తగ్గించుకోవడానికి మసాజ్ ప్రత్యామ్నాయంగా ఉపయోగ పడుతుంది.
- స్పా చేయించుకోవడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. శారీరక భావోద్వేగ, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చు.

అవగాహన అవసరం

మసాజ్, స్పా సెంటర్లను ఆశ్రయించేవారు సంబంధిత చికిత్సలపై అవగాహన కలిగి ఉండాలని నిపుణులు చెబుతున్నారు. కండరాలు నొప్పిగా, బిగుతుగా ఉంటే కొంత అసౌకర్యం అనిపించవచ్చు. అలాంటప్పుడు ప్రాక్టీషనర్‌కు ముందుకుగానే తెలియజేయాలి. గుండె జబ్బు, కరోనరీ ఆర్టరీ వ్యాధి, అధిక రక్తపోటు, వెన్నుముకను ప్రభావితం చేసే పరిస్థితులు, ఎముకల వ్యాధి, నాడీ సంబంధిత వ్యాధులు, మధుమేహం, ఇటీవల జరిగిన శస్త్ర చికిత్సలు, తెరిచిన గాయాలు, క్యాన్సర్, గర్భిణులకు థాయ్ మసాజ్ సిఫార్సు చేయకూడదని పేర్కొంటున్నారు. మసాజ్‌వల్ల కలిగే నష్టాలను విస్తృతంగా అధ్యయనం చేయలేదనే ప్రచారం ఉంది.

హద్దులు దాటొద్దు

స్పా సెంటర్ల నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల్లో నిబంధనలు అతిక్రమించకూడదు. హద్దులు దాటితే కఠిన చర్యలు తప్పవు. బయట ఒక బోర్డు పెట్టి లోపల మరో యాక్టివిటీ తలపెడితే జైలుపాలవుతారు. స్పా సెంటర్ల నిర్వాహకులకు, కస్టమర్లకు కూడా ఇబ్బందికరమే. అందువల్ల ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా నిర్వహించుకోవాలి. స్పా సెంటర్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడతాం.

– పార్థసారథి, గాజువాక సీఐ



స్పా సెంటర్‌లో ఎక్విప్‌మెంట్

క్లుప్తంగా

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



పార్కును శుభ్రం చేస్తున్న తిరుమలనగర్‌వాసులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్ రోడ్డు నెంబర్ 8లో శనివారం స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీవాసులు పాల్గొని పార్కులతో పాటు రహదారులను శుభ్రం చేశారు. అలాగే పిచ్చి మొక్కలను తొలగించారు. ఇటీవల వర్షాలకు చేరిన నీటి నిల్వలను తొలగించారు. కాలనీ వాసులు పరమానందం, సన్యాసిరావు, ఉదయశంకర్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవునికి పూజలు



కాలభైర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబే కాలనీ కొండపై శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని కాలభైరవ స్వామికి అమావాస్య సందర్భంగా శనివారం ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, దొడ్డి రమణ ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు గుమ్మడికాయలతో స్వామివారికి దీపారాధన చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో డి. నాగరాజు, ఉషారాణి, అరుణ, కాంతమ్మ, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలి

కూర్మన్నపాలెం: గణేష్ ఉత్సవాలు నిర్వహించే కమిటీలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని దువ్వాడ పోలీస్ స్టేషన్ సీఐ కె.మల్లేశ్వరరావు సూచించారు. లేకుంటే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానంగా విద్యుత్ తీగలు ఎవరికీ అందకుడా చూసుకోవాలని, వాటికి చిన్న పిల్లలను దూరంగా ఉంచాలన్నారు. విద్యుత్ తీగలకు మరమ్మతులు ఏర్పడితే తక్షణమే సంబంధిదిత సిబ్బందిని సంప్రదించాలన్నారు. అలాగే స్వామి విగ్రహాలను అధికారికంగా గుర్తించిన ప్రాంతాల్లోనే నిమజ్జనం చేయాలని ఆయన కోరారు. మండపాలకు సమీపాల్లో పేలుడు పదార్థాలు ఉంచరాదని.. అలాగే రాత్రి 10 నుంచి ఉదయం ఐదు గంటలు వరకు లౌడ్ స్పీకర్లు వేయరాదని ఆయన తెలిపారు. మండపాల్లో వలంటీర్లు అందుబాటులు ఉండాలని.. లక్కీడిప్‌లు, లాటరీలు నిర్వహించరాదని ఆయన వివరించారు. అలాగే మద్యం తాగి అల్లరి చేయడం, డ్రోన్ను వియోగం నిషేధించినట్టు పేర్కొన్నారు. దువ్వాడ పరిధిలోని మండపాల కమిటీల వారు బాధ్యతగా వ్యవహరించి ఉత్సవాలను ఆనందంగా నిర్వహించుకోవాలని కోరారు.

ఫిర్యాదులొస్తే సీజ్ చేస్తాం



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న దువ్వాడ ట్రాఫిక్ సీఐ వెంకటరావు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ ఆటోస్టాండ్‌లో ఆటోలు అందుబాటులో ఉంచి సహకరించాలని దువ్వాడ ట్రాఫిక్ సీఐ కిల్లి వెంకటరావు సూచించారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని ప్రీ పెయిడ్ ఆటోస్టాండ్ వద్ద శనివారం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రయాణికులను నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, అలా చేస్తే ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లకు గిట్టుబాటు కావడం లేదనే విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలో చార్జీలు మారే అవకాశం ఉందన్నారు. అప్పటి వరకు సహకరించాలని కోరారు.

నైపుణ్యం ఉంటేనే అవకాశాలు

అగనంపూడి: విద్యార్థులు సిలబస్‌కే పరిమితమైతే సరిపోదని, అన్ని రంగాల్లో నైపుణ్యంపెంపొందించుకోవాలని ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ వంశీకృష్ణ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇం కళాశాలలో శనివారం కోర్ ఇండస్ట్రీస్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రాక్టికల్ నాలెడ్జ్ కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాజెక్టుల తయారీ, వాటి ప్రదర్శన, రియల్ టైమ్ సమస్యలపై అవగాహన పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, విభాగాధిపతి దేవన్న పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య తదితరులు

అగనంపూడి: అన్ని దానాల కన్నా రక్తదానం మిన్నగా భావించాలని, ఒకరికి పునర్జన్మనిచ్చేశక్తి రక్తదానికి మాత్రమే ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతలపూడి వెంకట్రామయ్య అన్నారు. రాజయోగి ప్రకాశమణి దాదీజీ 18వ స్మృతి దినోత్సవం సందర్భంగా అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం అగనంపూడి ఏరియా ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ఇటువంటి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడి యువత రక్తదాన కార్యక్రమంలో విరివిగా పాల్గొవాలన్నారు. కొంతమంది 30 సార్లు కూడా రక్తదానం చేసేవాళ్లు ఉన్నారని, అటువంటి వారు ఎంతో ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, రాజస్థాన్‌లోని సంస్థ మౌంట్ అబూ ప్రతినిధి ఢిల్లీరావు, విశాఖ జిల్లా కోఆర్డినేటర్ బీకే సోమేశ్వరి , అగనంపూడి ఆస్పత్రి పరిపాలనాధికారి రవిరాజు, బ్రహ్మకుమారీస్ వివిధ సంస్థల ఇన్‌చార్జిలు బీకే వేణి, అగనంపూడి ఇన్‌చార్జి రామకోటి, నాయకులు గుదే సుశీలా గజేంద్రరావు, కిడిమి హనుమంతురావు, కర్రి దశేంద్ర, విందుల రాజు, డొక్కా రమేష్, కొరాయి జగదీష్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి పెంచడానికి కృషి

ఉక్కునగరం: తమ విభాగంలోమానవ వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉత్పత్తి పెంచడానికి కృషి చేస్తానని స్టీల్‌ప్లాంట్ రోల్ షాప్ అండ్ రిపేర్ షాప్ విభాగాధిపతి ఎ.రవిశంకర్ అన్నారు. నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన రవిశంకర్‌ను శనివారం ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి. తాడన్న, బయ్యే మల్లయ్య నేతృత్వంలో నాయకులు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైర్ రాడ్ మిల్, సింటర్ ప్లాంట్ విభాగాల్లోని మెకానికల్ మెయింటెనెన్స్‌లో రవిశంకర్ చూపిన ప్రతిభను గుర్తించి కీలక విభాగానికి అధిపతిగా నియమించారన్నారు. కార్యక్రమంలో డీజీఎం ఆర్. సత్యనారాయణ, టోప్సో, నాయకులు ఎల్.వి. రమణ, ఎస్. మోహన్‌బాబు, పైడి కొండలరావు పాల్గొన్నారు.



రోల్ షాప్ అండ్ రిపేర్ షాప్ నూతన విభాగాధిపతి రవిశంకర్‌ను సత్కరిస్తున్న నాయకులు

హెచ్‌ఆర్ నైపుణ్యానికి ఎన్‌ఐపీఎం అవశ్యం

ఉక్కునగరం: హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లో నైపుణ్యానికి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీఎం) వంటి వృత్తిపరమైన సంస్థలు అవశ్యకమని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి. పాండే అన్నారు. ఇటీవల ఎన్నికైన ఎన్‌ఐపీఎం విశాఖ చాప్టర్ కార్యవర్గ ప్రతినిధులు శనివారం ఆయన్ను ఉక్కు పరిపాలన భవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి సంస్థల వల్ల హెచ్‌ఆర్‌లో రోజురోజుకు వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవడంతో పాటు దానికి సంబంధించిన జ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ విభాగాధిపతి ఎం.ఎం. రావు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. చాప్టర్ చైర్మన్‌గా ఎన్నికైన బి. శేషగిరిరావు ఎన్‌ఐపీఎం ఇటీవల చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. చాప్టర్ కార్యదర్శి డాక్టర్ బి. కృష్ణకుమారి, చాప్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేతో ఎన్‌ఐపీఎం కార్యవర్గ సభ్యులు

అనాలోచిత నిర్మాణంతో అవస్థలు

అగనంపూడి: కాపు జగ్గరాజుపేట రైల్వే క్రాసింగ్ వద్ద అధికారులు అనాలోచితంగా నిర్మించిన అండర్‌పాస్ వల్ల ప్రయాణికులు ముప్పతిప్పలు పడుతున్నారు. కూర్మన్నపాలెం, దువ్వాడ, అగనంపూడి, స్టీల్‌ప్లాంట్ నుంచి ట్రాఫిక్ కష్టాలు లేకుండా వేగంగా నగరానికి చేరుకుందామని ఈ మార్గంలో వచ్చే వాహనచోదకులు ట్రాఫిక్ చక్రబంధనంలో చిక్కుకుంటున్నారు. ఫకీర్‌తక్యా నుంచి కాపు జగ్గరాజుపేట మీదుగా ఎస్టీబీఎల్, వీఎస్ఈజెడ్ గేట్లు, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలు, సత్తివానిపాలెం, నరవ, షీలానగర్‌కు వెళ్లే మార్గంలో రైల్వే క్రాసింగ్‌లు ఉన్నాయి. ఒకటి ప్రధాన లైన్ కాగా, రెండవది హిందూజా, ఎన్టీపీసీ పవర్ లైన్. ఈ రెండు ట్రాక్‌ల వద్ద ఒక వంతెన దాటిన వెంటనే మలుపులో మరో వంతె నిర్మించారు. అయితే వంతెన కింది నుంచి లోపలికి వెళ్లే వాహనానికి వచ్చే వాహనాలు కనపడని పరిస్థితి. మలుపు కూడా తక్కువ దూరంలో ఉండడంతో భారీ వాహనాలు, పాఠశాలల బస్సులు, లారీలు లోపలికి ప్రవేశిస్తే అంతే వాహనాలు చిక్కుకోవాల్సి వస్తుంది. పాఠశాలలు, కళాశాలలు, విధులకు హాజరయ్యే ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించకపోతే ప్రతీరోజూ ఇదే తరహాలో ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదని ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు.



వంతెన వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కున్న వాహనచోదకులు

మోసగించడంలో చంద్రబాబు నంబర్ వన్

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి

గాజువాక: ప్రజలను మోసగించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుది నంబర్ వన్ స్థానమని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి అన్నారు. కార్పొరేటర్ గుడివాడ అనూష లతీష్ ఆధ్వర్యంలో 68వ వార్డులో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్లను తొలగించి మోసం చేసిందన్నారు. కూటమి పాలనలో నగరవాసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం అందించిన పథకాలన్నీ రద్దు చేసి పేద, మధ్యతరగతి ప్రజల నోట్లో మట్టికొట్టారని ఆరోపించారు. మళ్లీ అలాంటి పథకాల కోసం జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్, వార్డు అధ్యక్షుడు సంద్రాన నూకరాజు, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు జీలకర్ర నాగేంద్ర, నాయకులు వరదాడ చిట్టిబాబు, హుస్సేన్, సత్యవతి, పెద హుస్సేన్, గొంతిన శ్రీనివాస్, గంత కోరు సత్యనారాయణ, పాలూరు రాజు, కోటేశ్వరరావు, శ్యాం, రొక్కం వెంకటరావు, ఈటి సురేష్, వంశీ, సతీష్, ముగిడి రమణ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

పెదగంట్యాడ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి భద్రత లభిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు అన్నారు. పెదగంట్యాడ పీహెచ్‌సీ వద్ద శనివారం స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ మార్గాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై సిబ్బంది, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే అందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఇంటి ఆవరణ, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం సిబ్బంది, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి వర్షాకాలంలో కలిగే అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ హేమలత, డాక్టర్ సంపత్‌బాబు,ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ, నాగభూషణం పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, సిబ్బంది

సీజనల్ వ్యాధులపై అవగాహన

అగనంపూడి: ప్రస్తుతం వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఈ క్రమంలో ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంపై శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు వీలుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి పరిపాలనాధికారి రవిరాజు, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

74వ వార్డులో ..



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ గోపీకృష్ణ

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డులో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బొట్ట అప్పలరాజు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి

పెదగంట్యాడ: సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ నాయకులు అన్నారు. స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో సురవరం సుధాకర్ రెడ్డి చిత్ర పటానికి శనివారం పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పెదపూడి దుర్గారావు, ఆనంద్, పోతయ్య, పోలయ్య, ఎల్లేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నేడు నిర్వాసిత కాలనీల్లో బైక్ ర్యాలీలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కు నిర్వాసిత కాలనీల్లో బైక్ ర్యాలీలు ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఒకేసారి 32 ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ)లు జారీ చేయడానికి నిరసనగా అగనంపూడి కొండయ్యవలస కోఆపరేటివ్ స్టోర్స్ నుంచి, కూర్మన్నపాలెం, ముస్తాఫా జంక్షన్ నుంచి, పెదగంట్యాడ జంక్షన్ నుంచి, గంగవరం కూడలి వద్ద ఉన్న గాంధీ బొమ్మ జంక్షన్ నుంచి బృందాలు ర్యాలీలు చేపట్టనున్నారు.